క్లుప్తంగా

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

సంఘం అధ్యక్షుడు యాదగిరి



నియామకపత్రం అందుకుంటున్న యాదగిరి

తలకొండపల్లి: తలకొండపల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా యాదగిరిని నియమించారు. ఈ మేరకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఎన్నికల అధికారి వాణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, సెక్రటరీగా బాలకృష్ణ, డైరెక్టర్లుగా శ్రీరాములు, హరీష్, శ్రీనివాసులు, కృష్ణయ్య, నాగరాజు, శంకర్ తదితరులను నియమించారు. యాదగిరి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం సంక్షేమావృద్ధికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు బాలయ్య, నర్సింహ, శ్రీకాంత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దు: ఎస్ఐ



కారులో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్రామాల నుంచి వచ్చే రోడ్లతోపాటు ప్రధాన రోడ్లపై వాహనాలను నిలిపి చెక్ చేసి పంపిస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదును వాహనాల్లో తీసుకెళ్లవద్దని.. ఒకవేళ అత్యవసరమైతే తగిన రశీదు చూపించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వాహనదారులు, ప్రజలు తమకు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



పాండురంగారెడ్డితో గోవర్ధన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన పాండురంగారెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో హంస వాహనసేవ నిర్వహించారు. అలివేలు మంగా, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఊరేగించారు. బుధవారం ఉదయం ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ స్నేహలత, క్లర్క్ ఆంజనేయులు, ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, కృష్ణగౌడ్, రంజిత్‌రెడ్డి, వేద పండితులు పద్మనాభచార్యులు, రామాచారి, శ్రీవత్సవ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

నాగోలు: ప్రపంచ నీటి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా శాంతి కోసం నీరు అనే అంశంతో నాగోలు డివిజన్ జైపురి కాలనీలో టౌన్ లెవెల్ మహిళా సంఘం సభ్యులకు సీడ్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యత, నీటిని ఎలా పొదుపుగా వాడుకోవాలి అనే అంశాలను హయత్‌నగర్ సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం వివరించారు. వర్షం నీటిని భూగర్భ జలాలుగా మార్చుకునేందుకు ప్రతి ఇంటిలో వాల్టా యాక్ట్ నిబంధనల ప్రకారం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేనేజర్ అర్చన, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగబ్రహ్మాచారి, రాజు, మమత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తీ!

- సౌకర్యాల లేమి, సిబ్బంది కొరత
- నిరుపయోగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఎమర్జెన్సీ సేవలపై చేతులెత్తేస్తున్న దుస్థితి
- వైద్యవిధాన పరిషత్‌లో కలపడంపై స్పష్టత కరువు
- పట్నం దవాఖానాలో రోగుల పరేషాన్



ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి

ఇబ్రహీంపట్నం రూరల్: ఒకప్పుడు నియోజకవర్గంలోనే పెద్దాస్పత్రిగా పేరుగాంచిన ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తీ చేసింది. వసతుల లేమి, సిబ్బంది కొరతతో ప్రస్తుతం కొట్టుమిట్టాడుతోంది. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు లేకపోవడంతో చేసేది లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా 30 పడకలు ఉన్న ఆస్పత్రిని 100 పడకలు చేసి అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఈ ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్‌కి అనుసంధానం చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అప్‌గ్రేడ్‌కి సంబంధించి ఎలాంటి పనులు ముందుకు సాగడం లేదు.

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే..

గతంలో యాచారం, ఆమనగల్లు, శంషాబాద్‌లోని ఆస్పత్రులు అప్‌గ్రేడ్ అయ్యాయి. అక్కడ తెలంగాణ వైద్య విధాన పరిషత్తు నుంచి ఉద్యోగులు నియమించారు. కాని ఇబ్రహీంపట్నంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంలాగా ఉంది పరిస్థితి. తెలంగాణ వైద్య విధాన పరిషత్తు నుంచి శానిటేషన్, డైట్ మాత్రమే ఇస్తామని అధికారులు అంటున్నారు. మిగతా ఏవి పట్టించుకోవడం లేదు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ వారు కూడా సౌకర్యాలు కల్పించడం లేదని వాపోతున్నారు. ఇంతకు ఈ ఆస్పత్రి తెలంగాణ వైద్యా విధాన పరిషత్‌లో ఉందా లేకా డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఉందా అని ఇక్కడ పనిచేసే వారే తలలు పట్టుకుంటున్నారు.

అత్యవసరమైతే నగరానికే..

ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో ప్రస్తుతం ఆరు మంది డాక్టర్లు, ఎనిమిది మంది నర్సులు పనిచేస్తున్నారు. ఇందులో ఒకరు డిప్యూటేషన్ మీద వెళ్తే.. మరో డాక్టర్ మెటర్నిటీ సెలవులపై వెళ్లారు. దీంతో ఇక్కడ వైద్యసేవల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోజుకు 200 పైగా ఓపీ చూడటం మందు బిల్లలు ఇచ్చి పంపించడం తప్ప మిగతా సేవలు అందడం లేదని రోగులు వాపోతున్నారు. ఎమర్జెన్సీ సేవలు మొత్తానికే నిలిపివేశారు. ఏ మాత్రం సీరియస్‌గా ఉన్న గాంధీ, ఉస్మానియా అంటూ పంపిస్తున్నారు. అలాగే రాత్రి 7 గంటల తర్వాత వైద్యులెవరూ అందుబాటులో ఉండటం లేదు. కేవలం నర్సులే డ్యూటీలో ఉంటున్నారు. రాత్రి డాక్టర్లు ఎక్కడ అని అడిగితే రావడం లేదు అని చెబుతున్నారు. ఎమర్జెన్సీ సేవలకు పోతే ప్రాణం పోవడం ఖాయమని రోగులు ఆస్పత్రికి పోవడమే మానేస్తున్నారు.

వెంటాడుతున్న నీటి సమస్య...

ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో రోగులకు కనీసం తాగేందుకు కూడా నీరు లేదు. ఇక్కడ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ కోసమే రోజువారిగా 10వేల లీటర్ల నీరు అవసరం ఉంటుంది. ఆమేర నీరు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్వహణ లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. నీటి కొరతతో ఆపరేషన్లకు కూడా మంగళం పాడారు. ఆపరేషన్ థియేటర్ కూడా శిథిలావస్థలో ఉంది.



నిరుపయోగంగా మూత్రశాలలు

డాక్టర్లు ఉండటం లేదు



ఇటీవల రాత్రిపూట జ్వరం కరవడంతో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాను. వైద్య చేయమని అడిగితే.. డాక్టర్ లేదని చెప్పారు. ఉదయం11 గంటలకు వస్తాడని అప్పుడు రావాలని చెప్పాడరు. దీంతో నర్సు సూది ఇప్పించి పంపిచారు.

– అంజమ్మ, పోల్కంపల్లి

సమస్యలు పరిష్కరించాలి



ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో నీరు లేక ఇబ్బందులు తప్పడం లేదు. రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. మూత్రశాలలు నిరుపయోగంగా మారడంతో ఎక్కడ పడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి.

– సూజాత, కౌన్సిలర్, ఇబ్రహీంపట్నం

అప్‌గ్రేడ్‌పై స్పష్టత లేదు



ఇబ్రహీంపట్నం ఆస్పత్రిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ వైద్యా విధాన పరిషత్తులో కలిపింది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. తాత్కాలికంగా శానిటేషన్, డైట్ మాత్రమే ఇస్తున్నాం. పోస్టులు మంజూరు కాలేదు. గతంలో నాలుగు ఆస్పత్రులకు అన్నీ మంజూరయ్యాయి. మరోసారి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 100 పడకలు అవుతుంది. అప్పుడు వైద్యులు అందుబాటులో ఉంటారు.

– డాక్టర్ రాజు, డీసీహెచ్ఎస్

నక్కర్తమేడిపల్లి మీదుగా రైల్వే లైన్

- ఇటీవల ప్రధాన రోడ్డుపై మార్కింగ్ చేసిన రైల్వే అధికారులు
- జిల్లా మీదుగా డోర్నకల్–గద్వాల రైల్వే మార్గం



తక్కళ్లపల్లి–నక్కర్తమేడిపల్లి మధ్యన వేసిన మార్కింగ్

యాచారం: మండలంలోని పలు గ్రామాల మీదుగా కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కాబోతున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల కింద మండల పరిధిలోని తక్కళ్లపల్లి–నక్కర్తమేడిపల్లి గ్రామాల మీదుగా రైల్వే అధికారులు రైల్వేలైన్ నిర్మాణం కోసం మార్కింగ్ చేసి గుర్తులేశారు. సౌత్ సెంట్రల్(ఎస్‌సీఆర్) రైల్వేశాఖ గతేడాది డోర్నకల్–గద్వాల వరకు రైలుమార్గాన్ని ప్రతిపాదించినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా గద్వాలకు నూతన రైల్వే మార్గం ఏర్పాటు కానుంది. అందులో భాగంగానే కొద్దిరోజుల కింద సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ అధికారులు రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్, తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల మీదుగా గద్వాల వరకు కొత్త రైల్వేలైన్ మార్గం కోసం సర్వే చేసి ఆయా ప్రాంతాల్లో మార్కింగ్ వేసి హద్దులు గుర్తించింది. డోర్నకల్ నుంచి గద్వాల వరకు వెళ్లే రైలు మార్గం రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూర్ మండలాలతో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, భూత్పూర్ తదితర ప్రాంతాల మీదుగా ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. మండలం మీదుగా కొత్త రైల్వే మార్గం ఏర్పాటు కాబోతున్నట్లు మార్కింగ్ గుర్తులు చూసిన స్థానికులు ఒకింత సంతోషం, మరింత ఆందోళన చెందుతున్నారు. రైల్వే మార్గం కావాల్సిన భూమిని ఏ మేరకు సేకరిస్తారోనని రైతుల్లో భయాందోళన నెలకొంది. ఇదే విషయమై రోడ్డు భవనాల శాఖ అధికారులను సంప్రదిస్తే తమకేమి సమాచారం లేదని అంటున్నారు.

నిరుపేద యువతి వివాహానికి సాయం



అనూషకు పట్టువస్త్రాలు, పుస్తెమట్టెలు అందజేస్తున్న రాంరెడ్డి దంపతులు

- దాతృత్వం చాటుకున్న దండెం రాంరెడ్డి దంపతులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గండిచెరువు గ్రామానికి చెందిన ఓ నిరుపేద యువతి వివాహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దండెం రాంరెడ్డి, మాధవి దంపతులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. గండిచెరువు గ్రామానికి చెందిన మోడెపు అనూష.. తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీన జరిగే తన వివాహానికి సహాయం అందించాల్సిందిగా అనూష చేసిన విజ్ఞప్తికి దండెం రాంరెడ్డి దంపతులు స్పందించారు. బుధవారం పెద్దఅంబర్‌పేటలోని వారి నివాసంలో అనూషకు పట్టువస్త్రాలతో పాటు పుస్తెమట్టెలను అనూషకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనూష మేనమామ దానయ్య గౌడ్, నాయకులు మల్లారెడ్డి, రాంబాబు, సత్యనారాయణ, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురంలోని ప్రసన్నాంజనేయ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీగల మాట్లాడుతూ, రామకృష్ణాపురంలోని ఆంజనేయ ఆలయం చాలా మహిమ గల ఆలయమని, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సరూర్‌నగర్, శ్రీరామకృష్ణాపురం డివిజన్లలోని కాలనీలకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయించానని తెలిపారు. శ్రీ ప్రసన్నాంజనేయ ఆలయం, ఖిల్లా మైసమ్మ ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు శైలజరెడ్డి, భూపాల్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, ఎల్లన్న, బాలకిషన్, అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవే లక్ష్యం



వైద్య శిబిరంలో పాల్గొన్న అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, సభ్యులు

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని అవేర్ సంస్థల చైర్మన్ మాధవన్‌జీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మొహబ్బత్‌నగర్ సమీపంలో భగవతి పురంలో మెగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలు అందించడమే లక్ష్యంగా నిరంతరం పని చేస్తున్నామన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. నిత్యం కొంత సమయాన్ని యోగ, ధ్యానం, వాకింగ్, వ్యాయమానికి కేటాయిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని సూచించారు. మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, కల్వకుర్తి, ఆమనగల్లు, తలకొండపల్లి, పలు మండలాలల్లో ఉచితంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, మందులు పంపిణీతో పాటు, పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో అవేర్ సంస్థ ప్రతినిధులు రాజవర్ధన్‌రెడ్డి, మంజూరు అహ్మద్, వరుణ్, తరుణ్, హిమబిందు, వెంకన్న, పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డికి పితృవియోగం



నివాళి అర్పిస్తున్న నాయకులు

కడ్తాల: కడ్తాల ఎంపీటీసీ సభ్యుడు, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు, డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి తండ్రి గూడురి నారాయణరెడ్డి(86) గుండెపోటుతో బుధవా రం మృతిచెందారు. కడ్తాలలోని శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో నారాయణరెడ్డి భౌతికకాయానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, టీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు.. నివాళి అర్పించినవారిలో ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



గాయత్రీనగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జైపాల్‌రెడ్డి

మీర్‌పేట: వేసవిలో బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ అధ్యక్షుడు పి.జైపాల్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రీనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పాఠశాల కరస్పాండెంట్ జార్జ్‌పాల్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడేలా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని జైపాల్ రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సురేశ్ రెడ్డి, సిబ్బంది పుష్పలత, ప్రసున, సోని, జితేందర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ మేళా



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్) అందరినీ ఆకట్టుకుంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు అక్బర్ అలీ తెలిపారు. మేళా కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

ఘనంగా స్థిర ప్రతిష్ఠాపనోత్సవాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో కంఠ మహేశ్వరస్వామి నూతన ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడవ రోజు గ్రామంలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు శివుడు, ఎల్లమ్మ, నంది, వనం మైసమ్మ, గణపతి విగ్రహాలను ఊరేగించారు. విగ్రహాలకు భక్తులు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో యజ్ఞయాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



విగ్రహాల ఊరేగింపు

తాగునీటికి కటకట



మంచాలలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న సిబ్బంది

- గ్రామాల్లో అడుగంటుతున్న భూగర్భజలాలు
- పూర్తిగా మిషన్ భగీరథ మీదే ఆధారపడుతున్న ప్రజలు
- డిమాండ్‌కు సరిపడా నీరు సరఫరా చేయలేని పరిస్థితి!

మంచాల: వేసవి ఎండలు ముదురడంతో గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికే వరిపంట చేలు ఎండిపోతున్నాయి. పాడి పశువులకు కూడా తాగునీరు అందని పరిస్థితి. దీంతో గ్రామాల్లో ప్రజలకు మున్ముందు నీటి కష్టాలు తప్పవనే భయం మొదలైంది. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటికి మిషన్ భగీరథ పథకం కింద తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో రోజుకి 5,078 లీటర్ల తాగునీటి డిమాండ్ ఉండగా ప్రస్తుతం 4,805 లీటర్ల తాగునీరు మాత్రమే సరఫరా అవుతోంది. నెలలో ఒకటిరెండు రోజులు పైపులైన్ల మరమ్మతుల పేరుతో నీటి సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో నీళ్లు రాని రోజులు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు వేసవి ఎండలు విపరీతం కావడంతో నీటి సమస్య చాలా తీవ్రంగా మారనుంది. ఇప్పుడు ప్రజలు పూర్తిగా మిషన్ భగీరథ నీటిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏమాత్రం నీటి సరఫరా నిలిపివేసినా ప్రజలు రోడ్లు ఎక్కా పరిస్థితి నెలకొంది.

గతంలో స్కీంబోర్లు...

గతంలో గ్రామాల్లో ప్రజలకు స్కీం బోర్లే ప్రధాన ఆధారం. వాటి ద్వారానే ఇంటింటికి నీటిని సరఫరా చేసేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్కీం బోర్లకు బదులు మిషన్ భగీరథ పథకం కింద ప్రత్యేకంగా పైపులైన్లు ఏర్పాటు చేసి, ట్యాంకులు నిర్మాణం చేసి ఇంటింటికి నల్లాల ద్వారా నీటిని సరఫరా చేసింది. అయితే ఆ నీరు కూడా సరిపోవడంలేదని ప్రజలు ఆవేదన చెందుతుంటే.. ఈ ఏడాది ఆ నీరు కూడా సరఫరా కాని పరిస్థితి కనిపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు కూడా తాగు నీటి అవసరాలకు సరిపడకపోతే పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని తాగునీటి కష్టాలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బోర్లు వట్టిపోయాయి



గ్రామాల్లో తాగునీటి కష్టాలు తలెత్తకుండా అధికార యంత్రాంగం చొరవ తీసుకోవాలి. ఇప్పటికే వేసవి ముదరడంతో భూగర్భజలాలు అడుగంటాయి. వ్యవసాయ బోర్లు నీళ్లు అందించడం లేదు. ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా జాగ్రత్త పడాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఆరుట్ల

ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం

ప్రభుత్వం తాగునీటి విషయంలో ముందస్తు చర్యలు తీసుకుంటుంది. మండల వ్యాప్తంగా 200 స్కీం బోర్లు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 139 పనిచేస్తున్నాయి. దాద్‌పల్లి, ఎల్లమ్మ తండా గ్రామాల్లో స్కీం బోర్ల మరమ్మతులు చేయిస్తున్నాం. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగు నీటిని అందిస్తాం.

– స్రవంతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, మంచాల